సాక్షి
చిత్తూరు
సోమవారం । 7 । అక్టోబర్ । 2024





## కన్నీటి వీడ్కోలు

బెట్టింగ్ కారణంగా నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబానికి బంధువులు అంతిమ వీడ్కోలు పలికారు. - 8లో



## కార్యకర్తలకు పరామర్శ

వివిధ కారణాలతో కష్టాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. - 8లో

## ఆధునికం.. ఆహ్వానం



ఆహ్వానం పలికే పద్ధతుల్లో ఆధునిక విధానాలు పాటిస్తున్నారు. డిజిటల్ ఆహ్వాన పత్రికల వాడకం పెరుగుతోంది. - 8లో

## న్యూస్‌రీల్

### భక్తులతో పోటెత్తిన బోయకొండ



బోయకొండలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సెలవు దినం కావడంతో ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో బోయకొండకు చేరుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. 20 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. దర్శనం అనంతరం అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అధికారులు పంపిణీ చేశారు.

### పంట పొలాలపై ఏనుగుల దాడి



పంట పొలాల వైపు వస్తున్న ఏనుగుల గుంపు

కల్లూరు(పులిచెర్ల): నాలుగు రోజులుగా పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. దీంతో చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. శనివారం రాత్రి అటవీ ప్రాంతం నుంచి దాదాపు 17 ఏనుగుల గుంపు కల్లూరు సమీపంలో సంచరించాయి. చుట్టు పక్కల ప్రాంతాల రైతులు ఈ ఏనుగుల గుంపు చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇలా అడవుల నుంచి వచ్చి పొలాలపై పడి పంట నష్టం చేస్తుండడంతో రైతులు భారీగా నష్ట పోతున్నారు. అటవీ అధికారులు ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

# ముత్యపు పందిరిలో..
# తేజోమయుడు



సింహ వాహనంపై శ్రీవారు

ఇల వైకుంఠం బ్రహ్మోత్సవ శోభతో అలరారుతోంది. గోవిందనామస్మరణతో మార్మోగుతోంది. బ్రహ్మదేవుడు స్వయంగా నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవం కనులపండువగా సాగుతోంది. మూడో రోజు ఉదయం సింహ వాహన సేవ కోలాహలంగా సాగింది. రాత్రి ముత్యపు పందిరిపై బకాసుర వధ అలంకరణలో అభయమిచ్చిన శ్రీవారిని దర్శించుకున్న భక్తలోకం పులకించిపోయింది.



ముత్యపు పందిరిలో విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

- అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవ
- స్నపన తిరుమంజనంలో సేద తీరిన ఉత్సవమూర్తులు
- కోలాహలంగా సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు అంబరాన్ని తాకేలా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం ఉదయం సింహవాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనాలపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. సింహవాహన సేవలో స్వామివారు యోగ నృసింహుని రూపంలో భక్తులను అనుగ్రహించారు. అనంతరం స్వామివారు ఉభయ దేవేరులతో కలసి స్నపన తిరుమంజనంలో సేద తీరారు. ఆ తర్వాత ఆలయం వెలుపల కొలువు మండపంలో వేయి నేతి దీపాల వెలుగులో స్వామివారు శ్రీమన్నారాయణుని రూపంలో ఊయలూగుతూ కనువిందు చేశారు. రాత్రి నిర్వహించిన ముత్యపుపందిరి వాహన సేవకు భక్తుల సందడి పెరిగింది. వాహన సేవల ముందు సాంస్కృతిక శోభ ఉట్టిపడింది. వివిధ రాష్ట్రాలకు చెందిన 20 కళా బృందాలలో 530 మంది కళాకారులు చూడచక్కని ప్రదర్శనలతో భక్తులను కట్టిపడేశారు. టీటీడీ ఈవో, అదనపు ఈవో, జేఈవో తదితరులు పాల్గొన్నారు.

### టీటీడీ ఆంక్షలు

ఈ సారి బ్రహ్మోత్సవాలకు టీటీడీ కఠినమైన ఆంక్షలు విధించింది. కొండపైకి చేరుకున్న భక్తులను ఎక్కడపడితే అక్కడ అడ్డుకుంటూ నిర్బంధించేస్తోంది. దీంతో భక్తులు గ్యాలరీకి చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి కొందరు గ్యాలరీలోకి వెళ్లలేక వెనుదిరుగుతున్నారు. ఫలితంగా గ్యాలరీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మూడో రోజు ఉత్సవంలో కూడా భక్తుల సందడి తగ్గింది.

### సిబ్బందికి వస్త్ర బహుమానం

బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వాహనం బేరర్లు, మేళం సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి సేలంకు చెందిన మెక్కినేశ్వరి టెక్స్‌టైల్స్ అధినేత తంగదురై దంపతులు వస్త్ర బహుమానం అందజేశారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి చేతుల మీదుగా వస్త్రాలను అందించారు.







శివ పార్వతుల నృత్యాభినయం



కళాకారుల ప్రదర్శన





### నేడు కలెక్టరేట్‌లో..
### ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

**నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే**

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలపై తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు స్వాతి. చిత్తూరు నగరం మూడోగేటు ప్రాంతంలో నివశిస్తున్నారు. భర్త ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. నెలకు రూ.20వేల వరకు ఆదాయం వస్తోంది. ఈ వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. జాగ్రత్తగా వ్యయం చేస్తున్నారు. నెలవారీ సరుకులకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు, గ్యాస్ రూ.1000, పాలు, పెరుగుకు రూ.1,500 బియ్యం రూ.1,700, స్కూల్ ఫీజులు, ఇతరత్రా ఖర్చులు పోను చేతికి చిల్లిగవ్వ మిగలడం లేదు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం వచ్చినప్పుడు రూ.1000 లేకుండా మందు బిళ్లలు మిగుడు పడదంలేదని, ఇందుకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆమె వాపోతోంది.

- శ్రీరంగరాజుపురం మండలం చిన్న తయ్యూరుకు చెందిన దేవ కుటుంబం దినసరి కూలీతో రూ.15,000 వరకు ఆదాయం అర్జిస్తోంది. అయితే ఈ ఆదాయం వారి జీవనానికి ఏ మూలకూ సరిపోవడం లేదు. నెలసరి నిత్యావసర ఖర్చులు రూ.7 వేలు దాటుతోంది. మందులు, మాత్రలకు రూ.3 వేలకు పైగా ఖర్చవుతోంది. ఇతరత్రా ఖర్చులు రూ.3 వేలు. మధ్యలో మంచీచెడు కార్యక్రమాలకు రూ.2వేలు లేకుండా వెళ్లలేని పరిస్థితి. ఇలా నెలలో కుటుంబ వ్యయం రూ. 20వేల వరకు అవుతోందని దేవ మదనపడుతోంది.



# ధరల దరువు.. బతుకు బరువు

- కొండెక్కిన కూరగాయలు, పప్పు దినుసుల ధరలు
- సెంచరీ దాటిన పప్పు ధరలు
- కందిపప్పు ధర డబుల్ సెంచరీ
- సన్నబియ్యంకు రెక్కలు
- ఘాటెక్కిన తెల్లగడ్డ... కేజీ రూ.400
- మింగుడు పడని చికెన్, మటన్, చేపలు
- పెరిగిన ధరలతో సామాన్య జనానికి ఆర్థికభారం

కాణిపాకం: పప్పులు నిప్పులవుతున్నాయి. కూరగాయలు కరుస్తున్నాయి. నూనెలు సలసల కాగుతున్నాయి. బియ్యం భయపెతోంది. మాంసం ముక్కలు మింగుడు పడలేకపోతున్నాయి. పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్య జనం కనీసం కోడిగుడ్డు కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. జేబులో రూ.100, రూ.200 డబ్బులు పెట్టుకుని మార్కెట్‌కు వెళితే సరుకులతో సంచి నిండి ఇంటికొచ్చే రోజులు పోయాయి. కనీసం రూ.3000 ఉంటేగానీ సరుకులు తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. అదీ అరకొరగానే. పెరిగిన ధరలు సామాన్యజనానికి బతుకుపై భయాన్ని తెచ్చిపెడుతున్నాయి.

**మధ్యతరగతి వెతలు**

మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు దడపుట్టిస్తున్నాయి. కూరగాయలు మొదలు అన్ని నిత్యావసరాల ధరలు మండుతున్నాయి. దీంతో సగటు మధ్యతరగతి జనాల బతుకు భారమైంది. ధరలు చూసి సామాన్యులు విలవిల్లాడుతున్నారు. కూలీ పనిచేసి జీవించే పేదలకు ఈ ధరలు ఏమాత్రం మింగుడుపడడం లేదు. నెలరోజుల కిందటికీ ఇప్పటికీ అటు నిత్యావసర వస్తువులు ఇటు కూరగాయల ధరలు ఆమాంతం పెరిగిపోయాయి. జిల్లాలోని మున్సిపాలిటీలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రజలు ధరాఘాతంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు నెలాఖరున మాత్రమే ఇబ్బందులు పడేవారు. అయితే ఇప్పుడు నెలంతా ఇబ్బందిగానే మారింది. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటినా సర్కారు నియంత్రించ లేకపోతోంది. ధరల మానిటరింగ్ కమిటీ ఉన్నా ఉపయోగం లేదు. సన్న బియ్యం కిలో నెల కిందట రూ.40 నుంచి రూ.50 ఉండగా, తాజాగా కిలో రూ.60 చేరింది. మంచిరకం కంది పప్పు కిలో నెల కిందటి వరకు రూ.120 ఉండగా నేడు కిలో రూ.200 పలుకుతోంది. మినప్పప్పు కిలో రూ.130 ధర ఉండగా ఉన్నట్టుండి కిలో రూ.180 చేరుకుంది. పచ్చబఠాణీ రూ.190, పెసరపప్పు కిలో రూ.80 నుంచి నేడు రూ.140 చేరుకుంది. వేరుశనగ పప్పు కూడా రూ.150పైనే ఉంది. ఇతర పప్పులు కూడా కిలో రూ.65 నుంచి రూ.100 చేరుకున్నాయి. మూడు నెలల క్రితం తెల్లగడ్డ కేవలం రూ.100 నుంచి రూ.150 వరకు పలికేది. ఇప్పుడు కేజీ ధర రూ.400 అమ్ముడవుతోంది.

### భగ్గుమంటున్న నిత్యావసరాలు

ఒక పక్క ఇంటి అద్దెలు.. మరోపక్క పిల్లల చదువులు.. ఇంకో పక్క అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకానికి పెరిగిన నిత్యావసరాల ధరలు, భగ్గుమంటున్న కూరగాయల ధరలు శరాఘాతంలా మారాయి. ఏడాది వ్యవధిలో కందిపప్పు ధర దాదాపు 50 శాతం పెరిగితే.. బియ్యం 13–25 శాతం వరకు పెరిగింది. నెలనెలా వచ్చే అరకొర జీతం అవసరాలకు సరిపోక అప్పుల పాలవుతున్న పరిస్థితుల్లో కుటుంబం నెల బడ్జెట్ తలకిందులవుతోంది. జీవనాన్ని సాగించడం పెద్ద యుద్ధంగా మారిపోయిందని జిల్లాలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహార పంటల సాగు తగ్గడం, వ్యాపారులు నిత్యావసరాలను అక్రమంగా నిల్వచేయడం ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా కూరగాయల పంటలు 15 వేల హెక్టార్ల వరకు సాగుతోంది. ఇందులో టమాట 8 వేల హెక్టార్ల వరకు సాగుకాగా..మిగిలిన విస్తీర్ణంలో బెండ, వంగ, దొండ, చిక్కుడు తదితర పంటలు సాగువుతున్నాయి. ఈ సాగైన పంటలు జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్లకు సరఫరా అవుతున్నాయి. వీటితోపాటు అధికంగా కూరగాయలు కర్ణాటకలోని కోలార్, చిక్‌బళ్లాపూర్ నుంచి జిల్లాలోని మార్కెట్‌లకు సరఫరా అవుతున్నాయి.

### కొండెక్కిన కూరగాయలు

కూరగాయల ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. వర్షాభావ పరిస్థితులు, పెట్టుబడి భారం, సాగు విస్తీర్ణం పడిపోవడంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. అల్లం పాతది కేజీ రూ.170, టమాట రూ.65, వంకాయ రూ.60, ఎర్రగడ్డ రూ.60, పచ్చిమిరప రూ.80, బీన్స్ రూ.120, పందిరి చిక్కుడు రూ.85, కందగడ్డ రూ.90, క్యారెట్ రూ.60, బెండ రూ.60, చిక్కుడు రూ.60, ముల్లంగి రూ.50, కాకర రూ.60, అలసందలు రూ.70, కాప్సికమ్ రూ.80 ధర పలుకుతున్నాయి. ఈ పెరిగిన ధరలతో సామాన్యజనం అల్లాడిపోతోంది. పల్లెల్లోని దుకాణాల్లోనే వీటి ధరలు రెండింతలుగా ఉంటున్నాయి. పల్లెల్లో దొరికే కూరగాయలు, ఆకు కూరలతో సరిపెట్టుకుంటున్నారు.

### చేతికందని మాంసం ముక్క

మాంసం ధరలు నోటికందనంత దూరంలో ఉంటున్నాయి. మాంసం కిలో రూ.450 చేరుకుంది. అలాగే చికెన్ ధరలు రూ.220 నుంచి రూ.240 వరకు పలుకుతోంది. ఆదివారం అదనపు రేట్లు తప్పడం లేదు. అదేవిధంగా చేపలు ఆయా రకాలను బట్టి కిలో రూ.150 నుంచి రూ.450, రొయ్యలు రూ.350 నుంచి రూ.520 పలుకుతున్నాయి. ఒక కోడిగుడ్డు రూ.6 పైగా అమ్ముడవుతోంది. దీనికి తోడు ప్రజలకు పూజకు కావాల్సిన పూల ధరలు మండిపోతున్నాయి. పూల రేట్లు పైపైకి వెళ్లాయి. మూర చామంతి రూ.30గా ఉంది. పూల మార్కెట్లో చామంతి కేజీ ధర రూ.350 నుంచి రూ.400 వరకు అమ్ముడవుతోంది.

### పప్పు రేట్లు చూస్తే వణుకు



కూరగాయలు రేట్లు వింటేనే కడుపు నిండి పోతా ఉండాది. పప్పు రేట్లు చూస్తేనే వణుకు వస్తా ఉండాది. కూలీ చేసి బతికేటోళ్లం.. మాబోటోళ్ల ఏం తిని ఎట్లా బతికేది. బజారుకు పోతే రూ.500లకు బ్యాగు నిండడంలేదు. టమాట, ఇంకేదైనా తక్కువగా ఉంటే ఆ కూరగాయలు కొని ఇంటికి వచ్చేస్తున్నాం. ఊళ్లో దొరికే ఆకుకూరలతో కాలం తోసుకొస్తున్నాం. – బుజ్జమ్మ, గంగాధరనెల్లూరు





# కేసులకు భయపడే ప్రసక్తే లేదు

- బైరెడ్డిపల్లెలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన



లక్కనపల్లెలో మాజీ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బైరెడ్డిపల్లె: కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బైరెడ్డిపల్లె మండలంలోని లక్కనపల్లెకు చెందిన మాజీ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి అక్రమ కేసులో జైలుకెళ్లిన విషయం తెలిసిందే. శ్రీనివాసులురెడ్డికి ఈ నెల 4న బెయిల్ మంజూరు కావడంతో స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆయన్ను పరామర్శించేందుకు బయల్దేరిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి తొలుత జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ నివాసంలో ఆదివారం తేనీటి విందులో పాల్గొన్నారు. అనంతరం లక్కనపల్లె వరకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి నివాసంలో పరామర్శించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని, నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పడం తప్ప ఇంత వరకు ఏమీ చేయలేకపోయారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామన్నారు. వచ్చేది మళ్లీ మన ప్రభుత్వమేనని, అప్పుడు దెబ్బకు దెబ్బ చెల్లించేద్దామన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎస్.వెంకటేగౌడ, మొగసాల రెడ్డెప్ప, యువరాజు, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, చెంగారెడ్డి, మురళీక్రిష్ణ, ప్రహ్లాద పాల్గొన్నారు.

# ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా?

- ముఖ్యమంత్రి సొంత జిల్లాలో బాలికలకు భద్రతేదీ?
- లోకేష్ నియోజకవర్గంలో 24 గంటల్లో ముగ్గురు మహిళలపై అత్యాచారం
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా



నగరి: రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా?.. ఉంటే బాలికలకు భద్రత ఇచ్చే బాధ్యత ప్రభుత్వానికి లేదా అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు బాలిక కిడ్నాప్, హత్యపై ఆమె దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడారు. సీఎం సొంత జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలో ఏడేళ్ల పాపను కిడ్నాప్ చేసి కిరాతకంగా హత్య చేసిన ఉదంతం గుండెను పిండేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే రక్షణ లేకపోవడం ప్రభుత్వ అసమర్థత కాదా అని ప్రశ్నించారు. గత నెల 29న అదృశ్యమైన బాలిక నాలుగు రోజులపాటు ఆ సమీప ప్రాంతాల్లోనే ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గుర్తించలేకపోయారన్నారు. వారం తర్వాత ఇంటికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే బాలిక శవమై కనిపించిందంటే ఈ హోం, డిప్యూటీ సీఎం, సీఎంలు ఏం చేస్తున్నట్టని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి తనయుడు, ఐటీశాఖ మంత్రి లోకేష్ నియోజకవర్గంలో 24 గంటల్లో ముగ్గురు మహిళలపై అత్యాచారం జరిగిందంటే పాలించే అర్హత ఈ ప్రభుత్వానికి ఉందా అని నిలదీశారు. హోంమంత్రి పక్క నియోజకవర్గం రాంబిల్లిలో ఒక యువతి కాపాడమని కోరినా పట్టించుకోకపోవడంతో జైలు నుంచి వచ్చి నిందితుడు చంపేశాడన్నారు. తల్లిదండ్రులు పిల్లలను స్కూల్‌కి పంపాలన్నా భయపడే పరిస్థితి ఉందన్నారు. తప్పుడు కేసులు పెట్టడానికి మదనపల్లె ఫైల్స్ అని ప్రత్యేక హెలికాప్టర్‌ను పంపిన ప్రభుత్వం ఫైల్స్‌కు ఇచ్చే విలువ ఆడబిడ్డలకు ఇవ్వదా అని ప్రశ్నించారు. ముచ్చుమూరు ఘటనలోనూ న్యాయం చేయని ప్రభుత్వం ప్రజలకు అవసరమా అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి 9వ తేదీన పుంగనూరుకు వస్తున్నారని తెలిసి ప్రభుత్వం, హోం మంత్రి పరుగులు తీస్తున్నారన్నారు.

## క్లుప్తంగా

### టీటీడీకి 27 టన్నుల కూరగాయలు వితరణ



టీటీడీ కూరగాయల వాహనానికి పూజలు చేస్తున్న దాతలు

పలమనేరు: టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమానికి పలమనేరుకు చెందిన గిరి, స్థానిక మండీ యజమానులు కలిసి 27 టన్నుల కూరగాయలు వితరణ చేశారు. వాటిని ఆదివారం ప్రత్యేక వాహనాల్లో స్థానిక మార్కెట్ నుంచి పంపించారు. వారిని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఆర్వీ బాలాజీ, సుబ్రమణ్యం గౌడు, రవీంద్రారెడ్డి, కిశోర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తులకు గడువు పెంపు

తిరుపతి అర్బన్: టూరిజం విభాగం వారు నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించి ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 30వ తేదీ వరకు గడువు ఇచ్చామని చెప్పారు. అయితే అందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 25వ తేదీ వరకు పెంచామని వెల్లడించారు. వీడియోలు లేదా రీల్స్‌ను edtpt@aptdc. in లేదా collector. tirupati@ap. gov. in మెయిల్‌కు ఈనెల 24వ తేదీ లోపు పంపాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 63099 42027, 98488 23086, 97059 33311 ను సంప్రదించగలరని కోరారు.





# ఆధునికం.. ఆహ్వానం

- స్మార్ట్‌గా ఇన్విటేషన్లు
- డిజిటల్ కార్డులతో పిలుపులు
- వీడియోలతో వాట్సాప్ మెసేజ్‌లు
- ప్రింటింగ్ కార్డు సంస్కృతిని వదిలేసిన ప్రజలు




క్యూఆర్ కోడ్‌తో తయారు చేసిన డిజిటల్ వెడ్డింగ్ కార్డులు




**తిరుపతికి చెందిన శ్రీనివాస్ కుమారుడు యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన కొడుకు వివాహానికి ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల్లోని బంధుమిత్రులకు ఆహ్వానం పంపేందుకు సన్నాహాలు చేపట్టారు. సమయం కేవలం 12 రోజుల మాత్రమే ఉండడంతో అందరికీ పత్రికలు పంచేందుకు వీలుకాని పరిస్థితి. కుమారుడి సలహా మేరకు బెంగళూరుకు వెళ్లి క్యూర్ స్కానర్‌తో వీడియో వెడ్డింగ్ కార్డులు, ఏటీఎం తరహాలో డిజిటల్ కార్డులు డిజైన్ చేయించారు. కేవలం 10 నిమిషాల్లోనే వాట్సాప్ ద్వారా బంధుమిత్రులకు ఆహ్వానం పలికేశారు. సరికొత్త ట్రెండ్‌తో అందించిన పెళ్లిపిలుపుపై ప్రతి ఒక్కరూ అభినందనలు కురిపించారు.**

తిరుపతి సిటీ : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వివాహ, శుభకార్యాలకు ఆహ్వానించే విధానం వినూత్నంగా మారింది. గతంలో వివాహాది శుభకార్యాలకు బంధుమిత్రులకు పిలవాలంటే కనీసం నెల రోజుల ముందుగా వెడ్డింగ్ కార్డులు ముద్రించి వ్యయ ప్రయాసలకోర్చి గడప గడపకు వెళ్లి పంచాల్సి వచ్చేది. మారుతున్న కాలంతో పాటు అది కాస్తా ఫోన్ కాల్స్, మెసేజ్‌ల రూపంలోకి వచ్చేసింది. డిజిటల్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఆధునిక యుగంలో ఆహ్వాన పత్రికలు వీడియో వెడ్డింగ్ **కార్డుల** రూపంలో హల్‌చల్ చేస్తున్నాయి. మ**రింత** ముందుకు వెళ్లిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ**తో** ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌**తో** డిజిటల్ వెడ్డింగ్ కార్డులు వచ్చేశాయి.

**ఏటీఎం తరహాలో కార్డులు**

పెళ్లికి బంధుమిత్రులను పిలిచేందుకు క్యూఆర్ కోడ్‌తో ప్రింట్ చేసిన ఏటీఎం తరహా కార్డులు ప్రస్తుతం మార్కెట్‌లో విస్తృతంగా వాడుకలో ఉన్నాయి. వీడియో వెడ్డింగ్ ఇన్విటేష**న్స్**‌తో పాటు ఉన్నతస్థాయి బంధుమిత్ర**ుల** కోసం విజిటింగ్ కార్డ్స్ రూపంలో ఉండే **డిజి**టల్ వెడ్డింగ్ కార్డులు పంపుతున్నారు. **ఏపీలో** తొలిసారి **పశ్చి**మగోదావరి జిల్లాలో ఓ కాంట్రాక్టర్ తన కుమా**రుడి వివాహం కోసం ఈ తరహా కార్డులను తయారు చేయించారు. ఇందులో కార్డుపై భాగంలో వధూవరుల ఫొటో, పేర్లు, ఆహ్వానించు తల్లిదండ్రుల పేర్లు మాత్రమే ఉంటాయి. వెనుక భాగంలో క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వివాహానికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. పెళ్లిమండపం అడ్రస్, లొకేషన్ మ్యాప్, పెళ్లి పత్రిక, విందు టైమింగ్స్, ముహూర్త సమయంతో పాటు సంప్రదించాల్సిన వధువు, వరుడి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు పొందుపరిచి ఉంటాయి.

**ఇప్పుడు ఇదే ట్రెండ్**

డిజిటల్ యుగంలో యువత బర్త్ డే, ఎంగేజ్‌మెంట్, గ్రాడ్యుయేషన్, బేబీ షవర్, ఆఫ్ శారీ ఫంక్షన్స్, గృహప్రవేశాలు వంటి అన్ని శుభకార్యాలకు వీడియో కార్డుల ద్వారా ఆహ్వానాలను వాట్సాప్‌లో పంపుతున్నారు. ఇంటర్నెట్, కంప్యూటర్‌పై అవగాహన ఉన్న ప్రతి వ్యక్తి ఉచిత టెంప్లెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు నచ్చిన డిజైన్‌లలో ఆహ్వాన పత్రికలను తయారు చేసేస్తున్నారు. కరోనా తర్వాత ఆహ్వానాలను డిజిటల్ పద్ధతిలో పంపేందుకే ప్రజలు ఇష్టపడుతున్నారు.




ఏటీఎం తరహాలో తయారైన డిజిటల్ వెడ్డింగ్ కార్డులు

**ప్రింటింగ్ కార్డులపై తగ్గిన మోజు**

వివాహ మహోత్సవంలో ప్రధాన భూమిక పోషించే వెడ్డింగ్ కార్డులు కాలానుగుణంగా రూపు మార్చుకుంటున్నాయి. బ్లాక్ అండ్ వైట్ కార్డులతో మొదలైన పెళ్లి పత్రికలు తర్వాత కలర్, యూవీ, లేజర్, ఫొటో ప్రింట్, సౌండ్ సిస్టమ్ కార్డులుగా మారాయి. ఈ ట్రెండ్ కొంత కాలం కొనసాగింది. రూ.2 నుంచి సుమారు రూ.20 వరకు ఒక్కోకార్డు ప్రింటింగ్ ధర ఉండేది. ప్రస్తుతం నయా ట్రెండ్ మొదలైంది. డిజిటల్ యుగంలో వీడియో వెడ్డింగ్ కార్డులు మార్కెట్‌ను శాసించాయి. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ స్కానర్‌తో రూపొందించిన డిజిటల్ కార్డుల వైపు యువత మొగ్గు చూపుతోంది. దీంతో ప్రింటింగ్ ప్రెస్ దుకాణాలు వెలవెలబోతున్నాయి.

**విశేషంగా స్పందన**

మా కాబోయే అల్లుడు లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మాది కొత్త బంధుత్వం. ఆగస్టు 14న బెంగళూరులోని ఓ కల్యాణ మండపంలో సెప్టెంబర్ 2న వివాహం జరిపేందుకు పండితులు ముహూర్తం పెట్టారు. వధువరూలు ఆగస్టు 20న ఇండియాకు వచ్చారు. పదిరోజులు మాత్రమే సమయం ఉంది. బంధుమిత్రులకు ఎలా ఆహ్వానం పంపాలనే ఆలోచనలో పడ్డాం. మా అల్లుడి సలహాతో ఏటీఎం కార్డు సైజులో క్యూఆర్ కోడ్‌తో ఉన్న డిజిటల్ కార్డులను తయారు చేసి అందరికీ వాట్సాప్ ద్వారా పంపించాం. బంధుమిత్రులు ఇబ్బంది లేకుండా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని కల్యాణ మండపానికి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. చాలా సంతోషంగా అనిపించింది.

– కోటేశ్వరరావు, తిరుపతి

**ప్రింటింగ్ కార్డులు తగ్గాయి**



గతంలో ప్రతి ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో సుమూహుర్తాలు ఉన్నందున పెళ్లి కార్డుల ప్రింటింగ్‌కు ప్రజలు ఎగబడేవారు. బిజినెస్ అంతా ఆ మూడు మాసాల్లోనే జరిగేది. నగరంలోని ప్రతి ప్రింటింగ్ ప్రెస్ నిర్విరామంగా పనిచేసేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గ్రామీణ ప్రాంత వాసులు మాత్రం అడపాదడపా తక్కువ క్వాంటిటీతో పెళ్లి పత్రికల కోసం వస్తున్నారు. సుమారు 50 శాతానికి పైగా బిజినెస్ తగ్గింది. కంప్యూటర్ కాలం, డిజిటల్ ఫోన్లు రాకతో పత్రికలకు డిమాండ్ భారీగా పడిపోయింది.

– వెంకటేశ్వర్లు, ప్రింటింగ్ ప్రెస్ యజమాని, తిరుపతి

### రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా టీచర్ల ప్రతిభ



రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన జిల్లాకు చెందిన టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఈ నెల 4, 5, 6 తేదీల్లో గుంటూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో చిత్తూరు జిల్లా టీచర్లు ప్రతిభ చాటారు. వాలీబాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలాజీ, సిరాజ్ అహ్మద్, వేణుగోపాల్, బాలాజీ, లక్ష్మయ్య, అంజిబాబు, గురుప్రసాద్, పి.బాలాజీ ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచి బంగారు పతకం సాధించారు. అలాగే 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో తీర్థం జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న దేవేంద్ర బంగారు పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించారు. వి.కోటకు చెందిన గజేంద్ర షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటారు. టీచర్లను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు శశికుమార్, ఎం.వి.రమణ, వంశీకృష్ణ పాల్గొన్నారు.

### జాతీయ రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థి



రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులతో పీడీ చంద్రశేఖర్‌రాజు

పుత్తూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్ర గ్రీకో రోమన్ రెజ్లింగ్ అండర్–17 పోటీల్లో వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రావణ్‌కుమార్ 92 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. అలాగే మరో విద్యార్థి ఉదయ్‌కుమార్ 71 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. శ్రావణ్‌కుమార్ ఈ నెల 22వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. వారిని హెచ్ఎం కరుణనవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు అభినందించారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ



సాంబయ్యను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: వివిధ కారణాలతో బాధపడుతున్న కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. వెదురుకుప్పం మండలం జీఎంపల్లెకు చేరుకున్న ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న సాంబయ్యను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆళ్లమడుగులో ఇటీవల మృతి చెందిన అవులూరి జైపాల్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లెకు చేరుకుని మాధవరెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై వాకబు చేశారు. అదే గ్రామంలో చెంగారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ముక్కరవానిపల్లెలో మృతి చెందిన పుష్పమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. పుష్పమ్మ పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, మాజీ ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, ఎర్రయ్య, రోశిరెడ్డి, యువత మాజీ మండల అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, నాయకులు ఈశ్వరరెడ్డి, నాగరాజు, కార్వేటినగరం మండలానికి చెందిన యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయరెడ్డి, సర్పంచ్ చిన్నబ్బరెడ్డి, నాయకులు వరాలురెడ్డి, దుర్గసముద్రం వెంకటేశ్, శ్రీనివాసులు, నరేంద్రరెడ్డి, మురగయ్య, ఢిల్లీ, దొరస్వామి, హమీద్, సర్పంచ్ లోకనాథం, మురాజ్ రెడ్డి పాల్గొన్నారు.

### జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు సభ్యులతో నిర్వాహకులు

పలమనేరు: ఈ నెల 8న గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా ఫుట్‌బాల్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్‌రెడ్డి, కిశోర్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన 18 మందిని జిల్లా జట్టుకు ఎంపికచేశారు. చిత్తూరుకు చెందిన ఉదయ్, ఎస్ నరేష్, బి.నరేష్, వివేక్, దినేష్, పలమనేరుకు చెందిన విక్రం రాజ్, ఉదయ్, కిరణ్, జాకీర్, సాగర్, జైరుద్దీన్, రాకేష్ చక్రి, మహ్మద్‌బాషా, హుజైఫా, ఫైజుల్లా, మంజు, దినేష్ ఉన్నారు. వారికి ఎంవీఆర్ కళాశాల డైరెక్టర్ కిశోర్‌కుమార్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా జట్టు కోచ్ విక్రం రాజ్, పవన్‌కళ్యాణ్, వివిధ టీంల కోచ్‌లు, పలువురు పీడీలు పాల్గొన్నారు.

### బావిలో పడి వృద్ధుడి మృతి

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ కట్టకింద ఇండ్లు గ్రామంలో ఆదివారం పెరుమాల్‌రెడ్డి (88) అదుపు తప్పి వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెరుమాల్‌రెడ్డి శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. తర్వాత ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆదివారం ఉదయం ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో చూడగా ఆయన మృతదేహం కనిపించింది. స్థానికులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పెరుమాల్‌రెడ్డి బావిలో నీటి మోటారుకి కట్టిన తాడుని గట్టిగా పట్టుకున్నట్టు గుర్తించారు. అదుపు తప్పి బావిలో పడిపోయిన వృద్ధుడు తాడు సాయంతో పైకి వచ్చేందుకు ప్రయత్నం చేశాడని, వీలుకాక మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం

- తప్పుడు కేసులకు భయపడొద్దు
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా



వైఎస్సార్‌సీపీ నాయకులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పలమనేరు/పెద్ద పంజాణి : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటామని, కూటమి నేతల బెదిరింపులకు భయపడొద్దని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన ఆదివారం పలమనేరు పట్టణ సమీపంలోని ఒక ప్రైవేట్ అతిథి గృహంలో నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు.
ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు పెరిగాయన్నారు. తప్పుడు కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎవరూ భయపడొద్దని, న్యాయస్థానాల ద్వారా గట్టిగా ఎదుర్కొంటామని తెలిపారు. ఆచరణకు సాధ్యంకాని హామీలను గుప్పించి జనాన్ని ఏమార్చి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు జనం దృష్టిని మరల్చే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇంకొ కొన్నాళ్లలో ప్రజల నుంచి తిరుగుబాటు రావడం ఖాయమన్నారు. కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పెద్ద పంజాణి మండలం లింగాపురం వద్ద కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, పెద్దపంజాణి కన్వీనర్ బాగారెడ్డి, నాగభూషణం, చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడి మృతి



యోసఫ్ (ఫైల్)

రామకుప్పం: రామకుప్పం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు యోసఫ్(53) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రామకుప్పం ఇన్‌చార్జ్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు. యోసఫ్ గత 15 నెలలుగా ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 2న అనారోగ్యంతో రామకుప్పం ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని పాఠశాలకు వెళ్లాడు. దసరా సెలవులు కావడంతో తోటి ఉపాధ్యాయులు సొంత గ్రామాలకు వెళ్లారు. యోసఫ్ జీతం తీసుకుని క్వార్టర్స్‌లో ఉండిపోయాడు. ఆదివారం ఉదయం దుర్వాసన రావడంతో వాచ్‌మన్ నాగరాజు లోపలికి వెళ్లి చూడగా యోసఫ్ శవమై పడి ఉన్నాడు. ఈ విషయాన్ని పోలీసులు, ప్రిన్సిపాల్‌కు తెలిపాడు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఇన్‌చార్జ్ ఎస్ఐ నరేష్, ప్రిన్సిపల్ రాజేంద్ర, జిల్లా సాంఘిక సంక్షేమ సహాయ అధికారి పద్మజ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుని బంధువులకు సమాచారం అందించారు. యోసఫ్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని స్వస్థలం ఉమ్మడి అనంతపురం జిల్లా అని పోలీసులు తెలిపారు.

### సదుంలో భారీ చోరీ

సదుం: సదుంలో ఆదివారం రాత్రి భారీ చోరీ వెలుగుచూసింది. బాధితుల కథనం మేరకు.. వీఆర్ఆర్ కాలనీలో నివసిస్తున్న భాస్కరస్వామి అర్చక వృత్తి నిర్వహిస్తున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తిరుమల బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. ఆదివారం రాత్రి తిరిగి రాగా ఇంటి తలుపులకున్న తాళాలు పగులగొట్టి ఉండగా గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉంచిన 250 గ్రాముల బంగారు, రూ. 2 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు బాధితులు చెప్పారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

# కన్నీటి వీడ్కోలు

- శోకసంద్రమైన జీడీ నెల్లూరు
- మూడు మృతదేహాలకు అంత్యక్రియలు
- చికిత్స పొందుతున్న దినేష్ రెడ్డి మృతి



దినేష్ రెడ్డి (ఫైల్)

**అప్పుల బాధతో కుటుంబంలోని నలుగురూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వారిలో ముగ్గురు మృతిచెందడంతో ఆదివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. గంట కూడా గడవకనే మరో వ్యక్తి కూడా మృతిచెందడంతో బంధువులు, గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సంఘటన మండల కేంద్రమైన గంగాధనెల్లూరులోని ఎగవూరులో చోటుచేసుకుంది.**

– గంగాధర నెల్లూరు

ఎగవూరు గ్రామానికి చెందిన నాగరాజురెడ్డి ఒకప్పుడు మంచి ఆస్తిపరుడు. అతనికి భార్య జయంతి, కుమారుడు దినేష్‌రెడ్డి, కుమార్తె సునీత ఉన్నారు. పిల్లలు ఇద్దరూ డిగ్రీ వరకు చదివారు. నాగరాజురెడ్డి ఉన్న ఆస్తులను విక్రయించి వచ్చిన డబ్బుతో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగులు పెట్టేవాడు. ఈ క్రమంలో బాగా నష్టపోయాడు. ఆస్తులన్నీ కరిగిపోయి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక కుటుంబమంతా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 4వ తేదీన పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. 5వ తేదీన తెల్లవారుజామున నాగరాజురెడ్డి, అతని భార్య, కుమార్తె మధ్యాహ్నం మృతిచెందారు. వారి మృతదేహాలకు ఆదివారం పోస్టుమార్టం పూర్తి చేసి మధ్యాహ్నం బంధువులకు అప్పగించారు. సాయంత్రం ఐదు, ఆరు గంటల మధ్య అంత్యక్రియలు చేశారు. వారిని కడసారి చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రెండు రోజులకు ముందు వరకు తమ మధ్య ఉన్న కుటుంబాన్ని క్రికెట్ బెట్టింగ్ భూతం కబళించిందని వాపోయారు. బరువెక్కిన హృదయాలతో కన్నీటిపర్యంతమయ్యారు. ముగ్గురికీ అంత్యక్రియలు పూర్తి చేసి గంట కూడా గడవకముందే దినేష్‌రెడ్డి(21) కూడా మృతిచెందాడు. అతని మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించనున్నట్టు పోలీసులు తెలిపారు.

# ప్రాణం తీసిన ఈత సరదా



మృతి చెందిన ఆకాష్

చిత్తూరు అర్బన్: దసరాల సెలవులు.. అందులోనూ ఆదివారం.. ఆ విద్యార్థి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తోటి స్నేహితులతో కలిసి చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లాడు. స్నేహితులు చేపలకు గాలం వేస్తుండగా ఆ బాలుడు ఈత కొట్టడానికి నీటిలోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లి నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు.
చిత్తూరు కట్టమంచి చెరువులో ఈత కోసం వెళ్లిన ఆకాష్ (13) అనే బాలుడు ఆదివారం మృత్యువాత పడ్డాడు. నగరంలోని గుర్రప్పనాయుడు వీధికి చెందిన గోవిందరాజులు, సుమతి దంపతుల కుమారుడు ఆకాష్ 8వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకుతోడు ఆదివారం కావడంతో స్నేహితులు ముగ్గురితో కలిసి కట్టమంచి చెరువులో చేపలు పట్టడానికి గాలాలు తీసుకుని వెళ్లారు. చెరువులో అందరూ చేపలు పడుతుండగా, ఆకాష్ ఈత కొట్టడానికి నీటిలోకి దిగాడు. కొద్ది దూరం వెళ్లగా అదుపు తప్పి లోతుగా ఉన్న గుంతలోకి జారిపోయాడు. నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఆకాష్‌ను వెలికితీశారు. వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. కొడుకు మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. వన్‌టౌన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.